**విలేకరులు కావలెను**

'వజ్రభారతి' తెలుగు దినపత్రిక లో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు, మండలాలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మండల విలేకరులు కావలెను.

**98498 39560**



Cell : 98498 39560

RNI.No : APTEL/2021/80994

# వజ్రభారతి


Dare to Write... Dare to fight

vajrabharathi@gmail.com

ఎడిటర్ : పమ్మి ఏడుకొండలు

సామాజిక, రాజకీయ జాతీయ తెలుగు దినపత్రిక








సంపుటి : 5 సంచిక : 124 ఎడిటర్ : పి.ఏడుకొండలు వెల : 2 రూపాయిలు తేదీ: ఆదివారం 3-5-2026 పేజీలు : 10 E-mail:vajrabharathi@gmail.com


# సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు...

- మంత్రి నారా లోకేష్ స్పందన
- శిక్షణ కోసం సింగపూర్‌కు 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో 5 రోజుల ప్రత్యేక కార్యక్రమం
- ఆధునిక బోధన పద్ధతులపై టీచర్లకు శిక్షణ
- ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితే తరగతి గది మారుతుందన్న మంత్రి లోకేష్



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను

2లో

# హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

- గత కొంతకాలంగా పవన్ కు అనారోగ్య సమస్యలు
- ఇటీవలే హైదరాబాద్‌లో శస్త్రచికిత్స
- హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన చంద్రబాబు
- శస్త్రచికిత్స నేపథ్యంలో తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచన
- తన నివాసానికి వచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చంద్రబాబు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు

2లో



# ఎగ్జిట్ పోల్స్ వెనుక కుట్ర

- స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేయడానికి సాధనంగా వాడుకుంటున్నారు
- అసెంబ్లీ ఎన్నికల్లో 200కుపైగా సీట్లు గెల్చుకుంటాం
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా

కోల్‌కతా: ఎగ్జిట్ పోల్స్ పేరుతో స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే కుట్ర సాగిస్తున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ మమతా బెనర్జీ ధ్వజమెత్తారు.

2లో



# దేశవ్యాప్తంగా నేడు నీట్ పరీక్ష

- మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు నిర్వహణ
- ఫుల్ షర్టు, షూస్, హైహీల్స్ నిషేధం
- రాష్ట్రం నుంచి 73 వేల మంది హాజరయ్యే అవకాశం
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

హైదరాబాద్: వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్--యూజీ) ఆదివారం జరగనుంది.

2లో



2లో

# ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీజేపీ ప్రచార జోరు

- మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ
- గోడపై నినాదాలు రాసి ప్రచారం ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- స్వయంగా కమలం పువ్వు గుర్తును చిత్రించిన కిషన్ రెడ్డి
- కార్యకర్తల్లో ఉత్సాహం కనిపిస్తోందన్న కేంద్రమంత్రి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో భారతీయ

# కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం కల్ల

- రెండున్నరేళ్ల పాలనలో అవినీతి అడ్డగోలుగా పెరిగింది
- వాళ్ల స్కాంలను చూసి ప్రజలు మరో 20 ఏళ్లు ఓటేయరు
- కేంద్రం గ్యాస్ ధరలు పెంచినందుకు నిరసనలు తెలపాలి
- పార్టీ రంగారెడ్డి జిల్లా నేతలతో సమీక్షలో కేటీఆర్

రంగారెడ్డిజిల్లా: 'రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో భూ కుంభకోణాలు, అరాచకాలు మినహా ప్రజలకు చేసిందేమీ లేదు. ఆ పార్టీ అరాచకాలు చూసి ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ప్రజలు వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేసే అవకాశం లేదు. ఆ పార్టీ మరో 20 ఏళ్ల వరకు అధికారంలోకి రావడం కల్ల'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి అడ్డగోలుగా పెరిగిపోయింది.



2లో



# 'పది' రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తులకు 7 వరకు గడువు

అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల రీ--కౌంటింగ్, రీ--వెరిఫికేషన్ కోరే విద్యార్థులు ఈ నెల ఏడో తేదీలోగా తమ పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని

# ముందస్తుగా నైరుతి పవనాలు..

త్వరగా నిష్క్రమణపై చెప్పలేమన్న ఐఎండీ



# ఉద్యోగులకు సీఎం రేవంత్ వరాలు..

- పీఆర్సీపై కీలక ఆదేశాలు
- ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు కీలక హామీలు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు, 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు
- వేతన సవరణపై పీఆర్సీ నివేదికను వెంటనే ఇవ్వాలని ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయాలతో మే 5న తలపెట్టిన ధర్నాను విరమించుకున్న ఉద్యోగ సంఘాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి



తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు కీలకమైన శుభవార్తలు చెప్పారు.

# చంద్రబాబుకు అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు: విడదల రజిని



- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదన్న రజిని
- అమరావతి నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని ఆరోపణ
- జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని వ్యాఖ్య

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతిలోని అద్దాల మేడలపై ఉన్న ప్రేమ సామాన్య ప్రజలపై లేదని ఆమె మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక కనీసం ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించిన ఆమె, జగన్ హయాంలో 66 లక్షలకు పైగా ఉన్న పెన్షన్లలో ఇప్పుడు ఏకంగా 6 లక్షల

# దేశవ్యాప్తంగా నేడు నీట్ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాయి. పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెన్--పేపర్ విధానం ద్వారా జరిగే ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 23 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నారురాష్ట్రంలో 73 వేల మందికిపైగా విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 150కిపైగా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రధాన నగరాల్లో ఎక్కువ సెంటర్లు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో సీసీటీవీ పర్యవేక్షణ, బయోమెట్రిక్ హాజరు నమోదు వంటి విధానాలు అమలు చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం: నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎన్‌టీఏ విధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. పరీక్ష రాసేందుకు వచ్చేటప్పుడు అడ్మిట్ కార్డ్, ఫొటో ఐడీ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది. పరీక్ష ప్రారంభానికి కనీసం ఒక గంట ముందే హాజరు కావాలి. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం. ఫుల్‌హ్యాండ్స్ దుస్తులు, షూస్ ధరించరాదు.

ట్రాన్స్‌పరెంట్ పెన్ మాత్రమే అనుమతిస్తారు. మెటల్ వస్తువులు, ఆభరణాలు నిషేధం. ఇక అమ్మాయిలు హెయిర్‌పిన్‌లు, క్లిప్‌లు, మెటల్ రబ్బర్ బ్యాండ్లు ధరించి వస్తే అనుమతించరు. పెద్ద చెవిపోగులు, గొలుసులు, బంగారు ఆభరణాలు ధరించరాదు. హైహీల్స్, అలంకరణలున్న షూస్ నిషేధం. సాధారణ చెప్పులు/శాండల్స్ మాత్రమే ధరించాలి. ముసుగు లేదా సంప్రదాయ దుస్తులు ధరించే వారు ముందుగా రిపోర్ట్ చేయాలి. అదనపు తనిఖీ జరుగుతుంది. మేకప్ పరిమితంగా ఉండాలి. అనుమానాస్పద వస్తువులు తీసుకురావొద్దు.

**పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు**

వేసవి కాలం కావడంతో పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు ప్రత్యేక సహాయం అందిస్తున్నారు. నీట్ పరీక్షలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, విజిలెన్స్ బృందాలు పనిచేస్తున్నాయి. సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు కూడా ఉంటుంది. పరీక్షను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

## హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు



పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## చంద్రబాబుకు అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు: విడదల రజిని



పెన్షన్లను కట్ చేశారని ఆరోపించారు. 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇస్తామన్న హామీని కూడా గాలికి వదిలేశారని విమర్శించారు. ఒకవైపు రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ, ఆ నిధులను చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తమ విలాసాల కోసం, ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల ప్రయాణాల కోసం వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, అడుగుకు రూ.18,500 పైనే ఖర్చు చేయడం దేశంలో ఎక్కడా లేని విడ్డూరమని రజిని పేర్కొన్నారు. కేవలం అక్కడ అద్దాల కోసమే రూ.2,500 కోట్లు ఖర్చు చేసే బదులు, ఆ నిధులతో మెడికల్ కాలేజీలు పూర్తి చేయవచ్చని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించవచ్చని ఆమె సూచించారు. ఆరోగ్యశ్రీకి రూ.4 వేల కోట్ల బకాయిలు పెట్టి సామాన్యుడి వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే అమరావతికి వ్యతిరేకం అంటూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని అన్నారు.

## ఉద్యోగులకు సీఎం రేవంత్ వరాలు..



(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో శనివారం జరిగిన సమావేశంలో వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. ఈ నిర్ణయాలతో సంతృప్తి చెందిన ఉద్యోగ సంఘాలు, మే 5న తలపెట్టిన ధర్నాతో పాటు ఇతర నిరసన కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు ప్రకటించాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఉద్యోగుల సేవలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు

ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, జూన్ 1వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కార్డులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే 100 రోజుల్లో రూ.6,000 కోట్లను విడుదల చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులను ఏ ప్రాధాన్యతా క్రమంలో ఎవరికి ముందుగా చెల్లించాలనే నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలకే వదిలివేస్తున్నట్లు ఆయన తెలపడం విశేషం.

పీఆర్సీ నివేదికపై తక్షణ ఆదేశం

ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ) అంశంపైనా సీఎం స్పష్టత ఇచ్చారు. పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత కమిషన్‌ను ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే జీతాల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 67,760 ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**రెండు నెలలకోసారి సమావేశం**

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర సంప్రదింపుల ప్రక్రియను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి ఉద్యోగ సంఘాలు సమావేశమై, తమ సమస్యలు, ఆందోళనలపై ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించాలని సూచించారు.

"ఇది ఉద్యోగ స్నేహపూర్వక ప్రభుత్వం, మీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని ఆయన భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం, గందరగోళం లేకుండా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడం వంటి చర్యలను ఆయన గుర్తుచేశారు.

## సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు...

ప్రత్యేక శిక్షణ కోసం సింగపూర్‌కు పంపింది. ఈ బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) పెంపొందించడం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలపై వీరికి లోతైన అవగాహన కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను నేర్చుకుని, వాటిని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి లోకేష్ వివరించారు. "ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుంది" అనే బలమైన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపడి, రాష్ట్ర విద్యా వ్యవస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'పది' రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తులకు 7 వరకు గడువు

ఎస్ఎస్‌సీ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్‌కు రూ .500, రీ--వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున రుసుము చెల్లించాలని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి జవాబు పత్రాలను రీ--వెరిఫికేషన్ కోసం పాఠశాల లాగిన్‌తో పాటు వాట్సప్ గవర్నెన్స్(మన మిత్ర)ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలు కల్పించినట్టు తెలిపారు.

## ఎగ్జిట్ పోల్స్ వెనుక కుట్ర

అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 200కు పైగా సీట్లు గెల్చుకోవడం తథ్యమని మరోసారి ధీమా వ్యక్తం చేశారు. ఆమె శనివారం పార్టీ నేతలు, కార్యకర్తలు, కౌంటింగ్ ఏజెంట్లతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో అవిశ్రాంతంగా పని చేశారంటూ వారిని ప్రశంసించారు. టీఎంసీ గెలుపును ఎవరూ ఆపలేరని ఉద్ఘాటించారు. కచ్చితంగా 200 సీట్లకుపైగా సొంతం చేసుకోబోతున్నామని వెల్లడించారు. స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేయడానికి ఎగ్జిట్ పోల్స్‌ను ఒక సాధనంగా వాడుకుంటున్నారని మమతా బెనర్జీ మండిపడ్డారు. 2021, 2024లోనూ ఇలాంటి కుతంత్రమే సాగించారని దుయ్యబట్టారు. ఇప్పుడు కూడా అదే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. బెంగాల్‌లో భారీగా కేంద్ర బలగాలను మోహరించడాన్ని, బలగాల దుందుడుకు వైఖరిని తప్పుపట్టారు. ఇది తమ పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న క్రూరత్వంగా అభివర్ణించారు. ఓటర్లను, ముఖ్యంగా మహిళలను భయపెట్టడానికి బీజేపీ కేంద్ర బలగాలను వాడుకుంటోందని టీఎంసీ ప్రధాన కార్యదర్శి, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. జవాన్లు ప్రతి గ్రామంలోకి, వీధిలోకి వెళ్లి మహిళలపై దాడి చేశారని, పిల్లలను కూడా వదల్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మీడియాలోని ఒక వర్గం కూడా వారికి సహకరిస్తోందని విమర్శించారు. ఇదిలా ఉండగా, వర్చువల్ భేటీ ముగిసిన తర్వాత మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

## ముందస్తుగా నైరుతి పవనాలు..

న్యూఢిల్లీ, మే 2: ఎండలతో అల్లాడుతున్న పౌరులకు భారత వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. సాధారణంగా వచ్చే దానికన్నా ముందే ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు భారత్‌ను పలకరిస్తాయని తెలిపింది. ఈ నెల 14-16 తేదీల మధ్య నైరుతి రుతు పవనాలు అండమాన్ వచ్చే సూచనలున్నాయని వెల్లడించింది. పలు రీజియన్లలో సాధారణం కంటే అధిక స్థాయిలో వేడి గాలుల దినాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, దేశంలోని మరికొన్ని చోట్ల ఈ నెలలో సాధారణ స్థాయి కంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. గుజరాత్ లోని సౌరాష్ట్ర, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని దక్షిణ ప్రాంతాలు, ఉత్తర ఉత్తర ప్రదేశ్, బీహార్, తమిళనాడు, ఒడిశా సహా కోస్తా రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ స్థాయిలో వడగాల్పులు వీస్తాయని తెలిపింది. దేశంలో రాత్రి పూట సాధారణం కంటే ఎక్కువ నమోదు కావచ్చునని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించినా, ముందుగానే నిష్క్రమిస్తాయని చెప్పలేమన్నారు.

## ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీజేపీ ప్రచార జోరు

జనతా పార్టీ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి గోడలపై నినాదాలు రాసి అందరినీ ఆశ్చర్యపరిచారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఈ ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ పాల్గొనే భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు ప్రజలను ఆహ్వానిస్తూ "ఛలో పరేడ్ గ్రౌండ్స్" అంటూ కిషన్ రెడ్డి స్వయంగా కుంచె పట్టి గోడపై రాశారు. అనంతరం బీజేపీ ఎన్నికల గుర్తు అయిన కమలం పువ్వును కూడా ఆయనే చిత్రించడం విశేషం. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అభివృద్ధి, పురోగతి దార్శనికతపై ప్రజలు, కార్యకర్తలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, వారి ఉత్సాహమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి స్వయంగా వాల్ రైటింగ్ చేస్తున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం కల్ల



అన్ని అంశాల్లోనూ కాంగ్రెస్ పార్టీ కమిషన్లు, కాసుల కక్కుర్తి కోసమే చూస్తుంది. మంత్రులే స్వయంగా రంగారెడ్డి జిల్లాలో భూముల ఆక్రమణతోపాటు మైనింగ్ కుంభకోణాలకు పాల్పడుతున్న పరిస్థితి నెలకొంది. అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలను మోసం చేసింది'అని దుయ్యబట్టారు. శనివారం నందినగర్‌లోని తన నివాసంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా నేతలతో కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతోపాటు పార్టీని బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణ, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎక్కడికక్కడ నిరసనలు: 'ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ఈ విధంగా ఉంటే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటోంది. వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ.వెయ్యి పెంచింది. అడ్డగోలుగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ వస్తున్న బీజేపీ నిర్వాకం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ అడ్డగోలు నిర్ణయాలపై బీజేపీకి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. మరోసారి ఈ ధరలు పెంచకుండా ఉండేందుకు ప్రజలను జాగృతం చేయాలి'అని కేటీఆర్ పేర్కొన్నారు. త్వరలో జరగనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, తర్వాత జరిగే కమిటీల నిర్మాణంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను కేటీఆర్ పార్టీ నేతలకు వివరించారు. 'రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బీఆర్ఎస్ చురుకైన పాత్ర పోషించబోతోంది. కాంగ్రెస్, బీజేపీ చేసే అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. ప్రతీ ఒక్క యువతీ, యువకుడికి ఓటు హక్కు కల్పించాలి. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయకుండా చూడాలి. కాంగ్రెస్, బీజేపీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. ప్రజల ఓటు హక్కుకు బాధ్యతగా భరోసాగా నిలవాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు త్వరలో మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఆ ఎన్నికలకు సమాయత్తం కావాలి'అని కేటీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.



## నాబార్డు నిధులతో మారుమూల ప్రాంతాలకు రోడ్లు

**ఆచంట, వజ్ర భారతి, మే 2:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మారుమూల ప్రాంతాల్లో సైతం రహదారులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. నాబార్డు నిధులు రూ 366.50 లక్షలతో ఆచంట శివారు బాలం వారిపాలెం, రావిగుంట వయా కసరత్తు గుంట మీదుగా రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కేత సత్యవతి మీరయ్య, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, స్థానిక ఎంపీటీసీ బోక్కా సుబ్రహ్మణ్యం, వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు తమ్మినీడి వరప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ, కూటమి మండల అధ్యక్షులు చిలుకూరి సీతారాం, జవ్వాది బాలాజీ,అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కొండాలమ్మ అమ్మవారి జాతర






**ఉండ్రాజవరం, వజ్ర భారతి, మే 2:** ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కొండాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో రోజుకొక వర్గీయులు అమ్మవారికి సారీ చీర సమర్పించుకునే సందర్భంలో పద్మశాలీల కుటుంబాలు అమ్మవారికి సారని సమర్పించే భాగంగా పద్మశాలి కుల బాంధవులు ఈ కార్యక్రమానికి వావిలాల సరళ దేవి ని అతిథిగా ఆహ్వానించుకుని ఆమె ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో,సాంప్రదాయకంగా,బాణాసంచాతో,మంగళ వాయిద్యాలనడుమ అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తూ సారీ చీర ని,పసుపు కుంకుమలను వివిధ రకాల తీపి నైవేద్యాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించడం జరిగింది . ఈ సందర్భంగా సరళా దేవి మాట్లాడుతూ గ్రామస్తులందరూ కులమతాలకతీతంగా రోజుకు ఒక వర్గీయులు ఈ సంప్రదాయాన్ని నిర్వహించడం చాలా ఆనందం సంతోషం ఇంత బృహత్తరమైన కార్యక్రమాన్ని కి నన్ను ఆహ్వానించడం చాలా సంతోషం ఆనందం అని తెలియజేస్తూ పాలంగి పద్మశాలి సంఘ సభ్యులకు, పాలంగి గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## ప్రత్తిపాడు అడిషనల్ కోర్టు ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

**పరిశీలించిన రాజమహేంద్రవరం మొదటి అదనపు జిల్లా జడ్జి సునంద**

**జూనియర్ సివిల్ జడ్జి ఎల్. గోపీనాథ్**



**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,మే,2:-** ప్రత్తిపాడు న్యాయవ్యవస్థ అభివృద్ధిలో కీలక ఘట్టంగా అడిషనల్ కోర్టు ప్రారంభానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం రాజమహేంద్రవరం గౌరవ మొదటి అదనపు జిల్లా జడ్జి సునంద, జూనియర్ సివిల్ జడ్జి ఎల్.గోపీనాథ్ తో కలిసి ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ నెల 10వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు గౌరవ హైకోర్టు జడ్జులు బట్టు దేవానంద్,ఆర్. రఘునందనరావు,బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తి,జగడం సుమతి, న్యాయపతి విజయ్ చేతుల మీదుగా ప్రత్తిపాడు అడిషనల్ కోర్టు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజాల చిట్టిబాబు,ప్రధాన కార్యదర్శి బొంగుళూరి మధుబాబు,ఉపాధ్యక్షురాలు ఆడారి సుగుణ,జాయింట్ సెక్రటరీ గెడ్డం కామేశ్వరరావు,ట్రెజరర్ శ్రీమతి అవసరాల దేవి,లైబ్రరీ సెక్రటరీ లింగంపల్లి శివకుమార్,కార్యనిర్వాహక సభ్యులు శలపాక శివప్రసాద్, బెహరా లక్ష్మీ ప్రసన్న,అలాగే సీనియర్ న్యాయవాదులు కొల్లా వీర్రాజు,అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు,రమణం వీర వెంకటరావు,పాలట్ల కాళీప్రసాదరావు,పిల్లి బలరాముడు,కిలపర్తి శ్రీనివాస్,మాదాల మంజూష,రెడ్నం వెంకటరెడ్డి,వనపర్తి మూర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను సమన్వయంతో పరిశీలించారు. ఈ అడిషనల్ కోర్టు ప్రారంభంతో ప్రత్తిపాడు ప్రాంత ప్రజలకు న్యాయ సేవలు మరింత వేగంగా,సులభంగా అందుబాటులోకి రానున్నాయని న్యాయవాదులు పేర్కొన్నారు.


# ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

## రెండో రోజుకు చేరుకున్న విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు

**తణుకు, వజ్రభారతి, మే 02:** తణుకు మండలం వేల్పూరు గ్రామంలో 45 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ రాముడికి ప్రియమైన భక్తుడిగా అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాధాకృష్ణ నాయకత్వంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు



నియోజవర్గంలో జరగాలని ఆయన ఆకాంక్షించారు. అభయాంజనేయ స్వామి వారి విగ్రహంతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మాణం ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తోందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ వేల్పూరు గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు కృతజ్ఞతలు



తెలియజేశారు. అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి కుటుంబ సభ్యులపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం: వజ్రభారతి, మే 2:** భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో నమోదు మరియు కోర్సుల పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పరిపాలనలో సాంకేతికత వినియోగం రోజురోజుకు కీలకమవుతున్న నేపథ్యంలో ఉద్యోగులు ఐగాట్ కర్మయోగి పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న శిక్షణా కోర్సులను పూర్తిచేసి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రతినెల కనీసం మూడు కోర్సులను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన మొత్తం 14,992 మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో 10,371 మంది ఇప్పటికే పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ఇంకా 4,621 మంది నమోదు కావాల్సి ఉన్నదని తెలిపారు. మిగిలిన ఉద్యోగులు వెంటనే నమోదు ప్రక్రియ పూర్తి చేసి, సంబంధిత కోర్సులను త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ పోర్టల్ ద్వారా ఉద్యోగులు ఆధునిక పరిపాలనా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, సేవల అందింపు విధానాల్లో మెరుగుదల సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించేందుకు సాంకేతికత వినియోగం కీలకమని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు సమీక్ష సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరు అయినట్లయితే సంబంధిత అధికారులపై పరిపాలనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలకు ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అన్ని శాఖాధికారులు తమ పరిధిలోని సిబ్బంది ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో నమోదు మరియు కోర్సుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించి, లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఓ శివపార్వతి, యు.మంగపతిరావు, గృహనిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్యతో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం: జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మే, 02:** జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం గొల్లలగుంట ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థులను సత్కరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, మెరుగైన బోధన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. 595 మార్కులు 13 మంది, 590కు పైగా మార్కులు 200 మంది విద్యార్థులు సాధించడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని అన్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ విద్యను అందిస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఆగి ఉన్న ట్రాక్టర్ ను వెనక నుండి ఢీ కొట్టిన మోటర్ సైకిల్

### యువకుడికి తీవ్ర గాయాలు

**పెనుమంట్ర, వజ్రభారతి, మే 2:** పెనుమంట్ర మండలంలోని ఆలమూరు గ్రామం జెనీసస్ స్కూలు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్ ని వెనుక నుంచి మోటార్ సైకిల్ తో బలంగా ఢీకొనడంతో ట్రాక్టర్ ఇనుప ఊస యువకుడికి పొట్టలోనికి వెళ్లడంతో గాయాలు పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన కర్రి హేమ సాయి కుమార్ రెడ్డి (20) భీమవరంలో ఐసెట్ ఎంట్రన్స్ పరీక్ష రాసి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు, వెంటనే స్థానికులు స్పందించి పెనుమంట్ర 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బాలకృష్ణ, పైలెట్ బ్రహ్మాజీ సకాలంలో ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రునికి సంఘటన స్థలంలోనే ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన చికిత్స కొరకు పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుని బంధువులకి 108 వాహన సిబ్బంది సమాచారం అందించారు. క్షతగాత్రుని ఆరోగ్య పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉందని సమాచారం.

## అక్రమంగా నిర్మించబడిన ఇళ్లను కోర్టు ఉత్తర్వుల మేరకు తొలగింపు



**వీరవాసరం: వజ్రభారతి, మే 2:** వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో చెరువు పోరంబోకు భూమిలో అక్రమంగా నిర్మించబడిన ఇళ్లను కోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించిన ప్రాంతాన్ని శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమారి రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు బాధితులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. మొత్తం తొలగించిన ఇళ్లలో అర్హత కలిగిన 16 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాలు (పట్టాలు) మంజూరు చేయడంతో పాటు, గృహ నిర్మాణానికి గృహ నిర్మాణ సంస్థల ద్వారా రుణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదనంగా, డ్వాక్రా సంఘాల ద్వారా కూడా అవసరమైన రుణ సదుపాయం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఇళ్ల తొలగింపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వారి పునరావాసం కోసం పూర్తి సహకారం అందిస్తుందని, ఇళ్ల నిర్మాణంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా పంచాయతీ అధికారి వై. దోసి రెడ్డి, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# వేల్పూరులో భవ్యంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

### ఆదివారం ఉదయం 7.14 గంటలకు సుముహూర్తం
### భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
### తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపు



**తణుకు, వజ్రభారతి,మే 02:** తణుకు మండలం వేల్పూరు గ్రామంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7.14 గంటలకు సుముహూర్తంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరగనున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడించారు. శనివారం రెండో రోజు కార్యక్రమాలు విశేష ఆధ్యాత్మిక వాతావరణంలో సాగాయి. వినాయక పూజ, గోపూజ, అధివాసములు, మూలమంత్ర హోమాలు, మన్యుపాశుపత అభిషేకాలు, వేద పారాయణం, సుందరకాండ పారాయణం, పురాణ ప్రవచనాలు, తీర్థ ప్రసాద వినియోగం భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం హోమాలు, పంచశయ్యాధివాసాలు, జలశాంతి పారాయణం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి, దర్బారు సేవ కార్యక్రమాలు భక్తి పారవశ్యాన్ని కలిగించాయి. ఆదివారం ప్రధాన ప్రతిష్టా మహోత్సవానంతరం శాంతి హోమం, శాంతి కళ్యాణం, 56 మంది చిన్నారులతో హనుమాన్ చాలీసా పారాయణం, అఖండ అన్నసమారాధన వంటి విశిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ దివ్య మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహోత్సవం వేల్పూరు గ్రామాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతోంది.



# మున్సిపల్ కమిషనర్ కు ఎమ్మెల్యే వార్నింగ్

### డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో అసహనం.



**కోటనందూరు,మే 02, వజ్రభారతి.:** పథకాలకు ప్రారంభోత్సవాలు ఆరంభ శూరత్వం కాకూడదు. బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధిగా కాకినాడ జిల్లా,తుని ఎమ్మెల్యే యనమల దివ్య కర్తవ్య నిర్వహణలో స్పీడ్ పెంచారు. క్షేత్ర స్థాయిలో ఏమి జరుగుతుందీ ...ప్రజలు ఆశించిన రీతిలో అధికార యంత్రాంగం పని తీరు ఎలాగుందీ తెలుసుకునేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగిన ఎమ్మెల్యే తుని పట్టణంలో మెరుపు వేగంతో చేసిన అకస్మిక తనిఖీలు మున్సిపల్ యంత్రాంగానికి ముచ్చెమటలు పట్టాయి. పట్టణ సుందరీకీకరణకు అధిక మొత్తంలో నిధులను ఎమ్మెల్యే యనమల దివ్య రప్పిస్తున్నా శానిటరీ విభాగం మొద్దు నిద్రకు డ్రైన్లు కంపుగొడుతున్నాయి. ఎమ్మెల్యే అకస్మిక తనిఖీల్లో మున్సిపల్ అధికారుల డొల్లతనం బయట పడింది. ఈమధ్యే ఎమ్మెల్యే దివ్యసీఎంఆర్ వద్ద డ్రైనేజ్ ను పరిశీలించి ఎప్పటికప్పుడు పూడికతీత చేయాలని కమీషనర్ ను ఆదేశించారు. దీంతో రెండు మూడు రోజుల్లో తూతూ మంత్రం చేసిన శానిటరీ విభాగం ఎవరు చూసోస్తారులే అన్న ధీమాతో ఇక్కడి డ్రైనేజ్ ను అసలు పట్టించుకోలేదు. గత రాత్రి శానిటేషన్ ను పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే యనమల దివ్య కూరగాయల మార్కెట్ ను సందర్శించిన వెంటనే తన కాన్వాయ్ ను సీఎంఆర్ సెంటర్ వద్ద మళ్ళించారు. దీంతో మున్సిపల్ అధికారులకు ముచ్చెమటలు పట్టాయి. అక్కడి ప్రధాన డ్రైన్ ను చూసిన ఎమ్మెల్యే యనమల దివ్య ఏమండీ కమీషనర్ గారు....ఇదేనా మీ శానిటేషన్ విభాగం పని తీరూ...నేను చెప్పందీ ఏంటీ... మీరు చేసిందేమిటీ..అని ప్రశ్నించారు. లేదు మేడమ్ ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయిస్తున్నామని కమీషనర్ బుకాయించడంతో ఎమ్మెల్యే యనమల దివ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై వారానికి ఒకసారి డ్రైన్ క్లీనింగ్ చేసి అందుకు సంబంధించిన ఫోటోలు తనకు పంపించాలని హుకుం జారీ చేసారు. ఇదే ఫైనల్ వార్నింగ్...మున్సిపల్ శానిటరీ విభాగం పని తీరు మెరుగు పడాలి... ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షణ చేస్తా...పని తీరులో మార్పు రాకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే యనమల దివ్య హెచ్చరించారు.

# అల్లిపూడిలో మేడే వేడుకలు




**కోటనందూరు,మే 02, వజ్రభారతి:** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, అల్లిపూడి గ్రామంలో మేడే వేడుకలు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రతపై మాట్లాడారు. కార్మికుల కృషి ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది కే లక్ష్మి, ఎన్ రామలక్ష్మి, కే పద్మావతి, ఎన్ అప్పలరాజు, ఎల్ ఎస్ వరలక్ష్మి ,ఆశా కార్యకర్తలు పి కృష్ణవేణి,డి శ్రీవల్లి, పంచాయతీ కార్మిక సిబ్బంది ఎన్ కృష్ణ, ఎం సత్తిబాబు, కే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల వ్యాపారస్తులతో ముచ్చటించిన ఎమ్మెల్యే దివ్య...

**కోటనందూరు,మే 02, వజ్రభారతి:** తుని కూరగాయల మార్కెట్ వర్తకులు తబ్బిబ్బు అయ్యారు. ఏనాడూ ఏ ప్రజాప్రతినిధి మా గోడు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇవాళ ఎమ్మెల్యే దివ్య మా మార్కెట్ కు వచ్చి మా మంచి చెడ్డలు తెలుసుకున్నారని మంచి ఎమ్మెల్యే...మా ఎమ్మెల్యే యనమల దివ్యమ్మ అంటూ తెగకొనియాడారు. శానిటేషన్ పరిశీలనార్ధం ఎవరికీ చెప్పకుండా తుని పట్టణంలో కూరగాయాల మార్కెట్ కు వచ్చిన ఎమ్మెల్యే ఆప్యాయత పలకరింపు వర్తకులను సంబర పరిచింది. ప్రతి దుకాణానికి వెళ్ళి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న యనమల దివ్య డబ్బులిచ్చి కూరగాయలు కొనుగోలు చేశారు. టిఫిన్ సెంటర్ కు వెళ్లి టిఫిన్ చేసారు. టీ స్టాల్ కు వెళ్ళి టీ తాగారు. ఇలా మార్కెట్ అంతా కలియ తిరిగి శానిటేషన్ పై ఆరా తీసారు. ప్రజాబాంధవంటే మా దివ్యమ్మేనని వర్తకులు వ్యాఖ్యానించారు.



# అల్లిపూడి లో పర్యటించిన ఎమ్మెల్యే దివ్య

## పెన్షన్ల పంపిణీ, సిసి రోడ్లు ప్రారంభం, కళ్ళజోళ్ళు పంపిణీ






**కోటనందూరు, మే 02, వజ్రభారతి:** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం,అల్లిపూడి గ్రామంలో ఎమ్మెల్యే యనమల పర్యటించారు. అభివృద్ధి పై ప్రత్యేక ఫోకస్ పెట్టిన యనమల దివ్య ఇవాళ తన దత్తత గ్రామంలో జోరుగా హూషారుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె స్థానిక శ్రేణులతో కొద్దిసేపు మాటామంతీగా భవిష్యత్ ప్రణాళికలపై సంభాషించారు. చర్మకారుల అభ్యర్ధన మేరకు కమ్యూనిటీ హాలు, బాబూజగజ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఎస్సీ కాలనీ 2లో అంబేద్కర్ భవనం ఏర్పాటుపై సానుకూలత వ్యక్తం చేశారు. ఇక గ్రామాభివృద్ధి భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రణాళికలను యువనేత అంకంరెడ్డి బుల్లిబాబు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. ఇక ఈపర్యటనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు,అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అనీ ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు. తుని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అంకంరెడ్డి బుల్లిబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సీనియర్ నేతలు యనమల రాజేష్,చింతంనీడి అబ్బాయిలతో కలిసి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యనమల దివ్య విచ్చేసి ప్రారంభించారు. ఇక్కడికి విచ్చేసిన ఆమెకు కూటమి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సీనియర్ నేత గాడి రాజబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు పోతల సూరిబాబు పర్యవేక్షణ లో ఎమ్మెల్యే యనమల దివ్య పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన యనమల దివ్య ఎస్సీ కాలనీలో వ్యాధిన బారిన పడ్డ దళిత మహిళ లంక రాజమణిని పరామర్శించారు. అనంతరం ఎస్సీ కాలనీ 2లో ఇంటింటికి వెళ్ళిన ఎమ్మెల్యే యనమల దివ్య వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని పెన్షన్లు పంపిణీ చేసారు. అంతకు ముందు ఇక్కడ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన ఆమె టీడీపీ జెండాను ఆవిష్కరించి సిమ్మెంట్ రోడ్లను ప్రారంభించారు .సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి కళ్ళద్దాలు ఎమ్మెల్యే దివ్య అందజేసారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్,సోసైటి అధ్యక్షుడు పెనుమచ్చు నాగేశ్వర్రావు, మాజీ ఎంపీపీ దంతులూరి చిరంజీవి రాజు, మాజీ జడ్పీటీసీ పెంటకోట భాస్కర సత్యనారాయణ,తాండవ ప్రాజెక్టు వైస్ చైర్మన్ మేడపురెడ్డి జోగిబాబు, సీనియర్ నాయకులు వెలగా వెంకట కృష్ణారావు, వాసం నాగేశ్వరరావు,సామినీడి కృష్ణార్జున, బోడపాటి సత్యనారాయణ, గుడివాడ అప్పలనాయుడు సుర్ల సావిత్రి,తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ వరలక్ష్మీ, గ్రామనాయకులు రుత్తల సత్యసీ తయ్యు, అంకంరెడ్డి గోపి, చింతకాయల సురేష్ కుమార్, చింతకాయల కొండబాబు,పెదపాత్రుని శ్రీనివాస్,దళిత నేతలు నెమ్మాది సత్యనారాయణ, ముప్పిడి జమీలు,కచ్చా చెల్లయ్య,చిట్టిమూరి జమీలు,కొండ్రు కళ్యాణ్,దుత్తర్తి అచ్చిరాజు దుత్తర్తి చిన్నారావు,దుత్తర్తి శ్రీరామ్ మరియు ఎంపీడీవో పి వెంకటనారాయణ, తాహసిల్దార్ పివివి సత్యనారాయణ పాల్గొన్నారు.

# మహిళా చట్టాలపై అవగాహనతోనే రక్షణ..

### ఆకతాయిలను ఎదిరించి నిలవండి
### జొన్నగిరి ఎస్సై ఎన్,సి,మల్లికార్జున



**తుగ్గలి మే 02( వజ్ర భారతి న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ గ్రామ పరిధిలోని మహిళల తో నిర్వహించిన అవగాహన సదస్సు గురించి జొన్నగిరి ఎస్సై ఎన్, సి, మల్లికార్జున,మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడానికి మహిళలు తమకు ఉన్న చట్టపరమైన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని జొన్నగిరి ఎస్సై ఎన్, సీ, మల్లికార్జున పిలుపునిచ్చారు. జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని యువతకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జొన్నగిరి ఎస్సై ఎన్ , సి,మల్లికార్జున మాట్లాడుతూ మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో యువత సన్మార్గంలో నడవాలని, సెల్ ఫోన్లలో వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. విద్యార్థినులను ఎవరైనా ఆకతాయిలు ఇబ్బంది పెడితే భయపడకుండా ఎదిరించాలని, తక్షణమే డయల్ 100 నంబర్ కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. యువత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై మల్లికార్జున హెచ్చరించారు. విద్యార్థి దశలో చదువుకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జొన్నగిరి ఎస్సై ఎన్, సి, మల్లికార్జున, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నివాళి

**జీలుగుమిల్లి (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ మే02:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. కార్యక్రమం ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను ఎమ్మెల్యే చిరస్మరణీయంగా కొనియాడారు. రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట సేవలు అందించిన మహానేతగా అభివర్ణించారు. ప్రజలకు మార్గదర్శకుడిగా నిలిచారని తెలిపారు. ఇలాంటి మహనీయుల సేవలు ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. భాస్కరరావు సేవలను గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు.





## నాదెండ్ల భాస్కరరావు కుటుంబానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పరామర్శ

**ఏలూరు (వజ్ర భారతి) మే 02:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఏప్రిల్ 22న కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన దశదిన కర్మ (పెద్ద కర్మ) కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హాజరై భాస్కరరావుకు ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం ఉదయం కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకున్న ఆయన, భాస్కరరావు చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి తన గౌరవాన్ని తెలియజేశారు.అనంతరం భాస్కరరావు కుమారుడు, ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## మేడే సందర్భంగా ఆహార పొట్లాలు పంపిణీ

### నిరంతరం పేదల సేవలో బుజ్జమ్మ



**తాళ్లపూడి / ఏలూరు వజ్ర భారతి మే 2:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఏలూరు వాసి డా. విజయ శ్రీ రొడ్డ (బుజ్జమ్మ)మేడే ను పురస్కరించుకుని ఏలూరు లోని పేదలకు అభాగ్యులకు భోజనం ప్యాకెట్ అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా బుజ్జమ్మ మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రపంచ కార్మిక సోదరులకు శుభాకాంక్షలు అందచేశారు. సందర్భం ఏదైనా పేద బడుగు ప్రజలకు కనీస అవసరాలైన తిండి బట్ట తదితర అవసరాలు తీర్చడం తనకు అలవాటు గా మారిందని, మానవ సేవే మాధవ సేవ అని తెలిపారు. అవకాశం ఉన్నవాళ్లు తన పొరుగువానికి కొంతైనా సాయం అందించాలని కోరారు.

## వేడి తాపానికి ఉపశమనంగా చలివేంద్రం ఏర్పాటు

### మొదటి రోజు మజ్జిగ పంపిణీ




**తాళ్లపూడి, వజ్ర భారతి మే 2:** తాళ్లపూడి కి చెందిన పర్యావరణ మిత్రుడు శివ మరోసారి తన సేవాతత్పరత చాటుకున్నాడు. వేసవి తాపనికి అల్లాడిపోతున్న ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సిద్దమై తాళ్లపూడి బస్ స్టాండ్ సెంటర్ లో మంచి నీటి చలివెంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా మొదటి రోజు బాటసారులకు శివ దంపతులు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం వినాయక చవితికి శివ స్వయంగా భారీ మట్టి గణపతి విగ్రహాలను తయారుచేసి నిర్వాహకులకు అందచేస్తూ పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నాడు. శివ దంపతులు మంచి నీటి చలివేంద్రం ఏర్పాటు చేయడం పై పలువురు ఆ దంపతులను అభినందిస్తున్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చైర్మన్ తుగ్గలి నాగేంద్ర

### గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన గ్రంథాలయ చైర్మన్ నాగేంద్ర

**తుగ్గలి మే 02 (వజ్ర భారతి న్యూస్):** గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన తుగ్గలి నాగేంద్ర, అన్నారు. శనివారం బనగానపల్లెలో గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడం కోసం వరుసగా వేస్తున్న నోటిఫికేషన్లు వేస్తుందన్నారు. ఆయా ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యేందుకు కావాల్సిన పుస్తకాలు గ్రంథాలయంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



# తాళ్లపూడి లో ట్రాఫిక్ తలనొప్పి



**తాళ్లపూడి, వజ్ర భారతి మే 2:** మండల కేంద్రమైన తాళ్లపూడి మెయిన్ రోడ్ లో రోజు రోజుకి ట్రాఫిక్ సమస్య పెరుగుతూనే ఉంది. గతం కంటే తాళ్లపూడి మెయిన్ రోడ్ లో ఎప్పుడు బిజీగా వుండే సెంటర్ల సంఖ్య కూడా పెరిగింది. ముఖ్యం గాతాళ్లపూడి బస్టాండ్ ఏరియా, వి.ఎస్.ఎన్ మాల్, రైస్ మిల్ సెంటర్ ఇది గాక గాంధీ బొమ్మ సెంటర్, ఫిష్ మార్కెట్ ఇలా చెప్పుకుంటూ పోతే అర కిలో మీటర్ వుండే ఈ మెయిన్ రోడ్ మొత్తం అనేక సందర్భాల్లో వాహనాన్ని వాహనము తప్పించు కునే పరిస్థితి కానరాదు. ట్రాఫిక్ చలాన్స్ మాములేతాళ్లపూడి పోలీస్ దఫా దఫాలుగా ట్రాఫిక్ లోకి రావటం, వాహనాలు కు చలాన్స్ రాయటం మాములే కానీఇరుకుగా వుండే మెయిన్ రోడ్ లో షాప్ లు ముందు ఉంచే వాహనాలకు హెచ్చరికలు చేయటం పరిపాటి గానే సాగుతుంది. అసలు ప్రాబ్లెమ్ ఆక్రమణలేతాళ్లపూడి మెయిన్ రోడ్ లో అన్ని వ్యాపార సంస్థలే కాగా ఆర్ అండ్ బి రోడ్ కి ఇరువైపులా ఉన్న షాప్ లు రోజురోజుకీ రోడ్ పైకి విస్తరిస్తుంటాయిఎ ాటిని పంచాయతీ శాఖ కానీ, ఆర్ అండ్ బి శాఖ కానీ పట్టించుకోవు. పాత షాప్ లు ఎలా వున్నా, కొత్తగా చేసే నిర్మాణాలు కూడా రోడ్ సమీపం లోకి వచ్చేయటం తో షాపుల ముందు వాహనాలు పెట్టాలంటే రోడ్ మీదే పెట్టాలి. రోడ్ మీద వెళ్లే వాహనాలు కు దారి ఉండదు. హద్దేలేదు షాపులు వాళ్ళు ఆర్ అండ్ బి రోడ్ వైపు దూసుకురావటానికి కారణం పంచాయతీ పట్టించుకో పోవటం కూడా ఓ కారణం. గతం లో డ్రైనేజీ ఉండేది. మెయిన్ రోడ్ లో ఉన్న ఆర్ అండ్ బి రోడ్ కిరువైపులా గల భవనాలకు అది ఒక హోద్దుగా కూడా ఉండేది. ఆ డ్రైన్ కూడా పూడి పోవటం తో అన్ని హద్దులు దాటేసి రోడ్ పైకి వస్తున్నారు. సమస్యలు పరిష్కారానికి పంచాయతీ, పోలీస్ రెవెన్యూ, ఆర్ అండ్ బి అన్ని శాఖల సమన్వయం తో పని చేయాల్సి ఉంది.

# ఈ రహదారి ఎవరి కోసం?



**తాళ్లపూడి, వజ్ర భారతి మే 2 :** తాళ్లపూడి మండలం ప్రక్కిలంక పంచాయతీ పరిధి లోని శివాలయం వెనుక గల పుంత దారి లో సిమెంట్ రోడ్ వేస్తారన్న ప్రచారం జరగటం పట్ల పలువురు రైతులు తమ అభ్యంతరాన్ని అధికారులు దృష్టికి తెచ్చారు. సిమెంట్ రోడ్ అని కొందరు,పుంత రోడ్ అని కొందరు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ రోడ్ రైతుల కోసమా? లేక కొంత మంది వ్యక్తుల స్వ ప్రయోజనానికా? అన్న చర్చ విపరీతంగా జరుగుతోంది. నిజానికి ఈ దారి లో ఇటుక బట్టీలు , పంట పొలాలు ఉండగా, శివారు ఇస్కాన్ సెంటర్ వరకు వెళుతుంది. కొత్తగా ఇటీవల ఎక్సటేన్షన్ చేస్తున్న మండపం దారి కూడా ఈ మార్గం లోనే ఉంది. మొత్తం మీద ఈ రహదారి నిర్మాణం స్థానిక కూటమి నాయకులు సైతం తమకు తెలియ కుండా పనులు ప్రతిపాదించారా? అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలు గల రైతాంగం పుంత రోడ్ వెయ్యటాన్ని స్వాగతిస్తున్నారు, కానీ సిమెంట్ రోడ్ తమకు అవసరం లేదు అంటున్నారు. ఇక సిమెంట్ రోడ్ వేయాలన్న ప్రతిపాదనలు ఆ దారి లో గల కొంత మంది స్వ ప్రయోజనం కోసం అధికారులును, నాయకులును ప్రసన్నం చేసుకున్నారని సమాచారం. ప్రభుత్వ నిధులు ప్రవేట్ వ్యక్తుల అవసరాలకు వాడితే చూస్తూ వూరుకోం అని స్థానిక నాయకులు తెలుపుతున్నారు . దీనిపై ఏ ఒక్క అధికారి పూర్తి సమాచారాన్ని ఇవ్వ లేక పోవటం కొసమెరుపు.



## మండలంలో ఘనంగా మే డే వేడుకలు

**తాళ్లపూడి, వజ్ర భారతి మే 2:** కార్మికులు అంతా సమైక్యంగా ఉండి హక్కులను రక్షించుకోవాలని కార్మిక నాయకులు తెలిపారు . మే డే సందర్బంగా తాళ్లపూడి మండలం లో మే డే కార్యక్రమాల్ని నిర్వహించారు. సి.ఐ.టి.యు అనుబంధ సంస్థలు అయిన జట్టు కార్మికులు, దుర్గా భవాని భవన నిర్మాణ కార్మికుల సంఘం, ఈశ్వర ఏసు భవన నిర్మాణ కార్మికులు సంఘం ఆధ్వర్యంలో నాయకులు మైగాపుల అంజ నేయులు పతాకాన్ని ఆవిష్కరించారు. తాళ్లపూడి రైస్ మిల్లు సెంటర్ లో రైస్ మిల్లు జట్టు కార్మికులు సంఘం ఆధ్వర్యంలో పతాకాన్ని ఆవిష్కరించారు. సుబ్రహ్మణ్యం, సుంకర వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. వల్లేపల్లి నర్సింహ మూర్తి, కేదార్, గోలి అన్నవరం, తదితరులు పాల్గొని బస్టాండ్ ఆవరణ లో పతాకాన్ని ఆవిష్కరించారు. పలు సంఘాల ఆధ్వర్యంలో పనివారల సంఘం మే డే పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆశా కార్య కర్తలు, అన్ని సంఘాల సభ్యులు కలిసి పంచాయతీ కార్యాలయం నుండి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ సాగించారు. తాళ్లపూడి పి ఎచ్.సి ఆశా కార్య కర్తలు ఏ.వి.రాఘవ, కె.సుధారాణి, బేబీ, మహాలక్ష్మి, కుమారి, పొసమ్మ, జ్యోతి, రూపవతి పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు. వేగేశ్వరపురం కాలేజి సెంటర్ లో పతాకాన్ని ఆవిష్కరించారు. లక్ష్మీ గణపతి యూనియన్ జల్లెపల్లి నాగరాజు, దేవన సత్తిబాబు, కొమ్మిరెడ్డి మణికంఠ, కర్రీ నాగరాజు, దూసన పూడి లక్ష్మీ పతి. తదితరులు పాల్గొన్నారు. మే డే సందర్బంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో మజ్జిగ పంపిణీ చేశారు.

## శుభకార్యంలో రాజకీయ కోలాహలం : మురళీరాజు పర్యటన



శంఖవరం వజ్రభారతి ప్రతినిధి. ముఖే.వీరబాబు మే 2: మండల పరిధిలోని నెల్లిపూడి గ్రామంలో పిర్ల చిన్న నూకరాజు కుమారుడు నాగ వెంకటేష్ వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ వేడుకకు ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్సీపీ నేత నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ఎంఎంఆర్ చారి టబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రత్యేకంగా విచ్చేశారు పెళ్లి వేదికపై నూతన వధూవరులను ఆశీర్వదించి చిన్న నూకరాజు కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మచ్చర్ల శ్రీను ప్రత్తిపాడు మండల ఉపాధ్యక్షులు కిల్లాడి బాబ్జి జువ్వల దొరబాబు కోన బాబ్జి గోనుగాని రామకృష్ణ సహా వైయస్సార్ కుటుంబ సభ్యులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు మురళీకృష్ణంరాజు రాకతో వివాహ ప్రాంగణంలో సందడి నెలకొంది.

## శ్రీ స్వామివారి నిత్య అన్నదాన పథకమునకు రూ. 3,16,000 /- విరాళం



**శంఖవరం వజ్రభారతి ప్రతినిధి. ముఖే.వీరబాబు మే 02:** ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ప్రతిరోజు జరుగు శ్రీ స్వామివారి నిత్య అన్నదాన పథకమునకు ఆచంట గ్రామ వాస్తవ్యులు చల్లా శివ సత్యనారాయణ చల్లా శివ నాగేశ్వరరావు చల్లా శివ నాగ దుర్గ సూర్య ముఖేష్ కుటుంబ సభ్యులు శ్రీ స్వామివారి నిత్య అన్నదాన పథకమునకు ఆలయ నిర్వహణ అధికారి ఎన్ సూర్య చక్రధరరావు చేతులకు రూ.3,16,000/- రూపాయలు విరాళమును అందజేసినారు ప్రతి సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో మే 5 న ఫిబ్రవరి 20 న మరియు ఆగస్టు 12 వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా కోరారు ఈ సందర్భంగా దాతలను ఈవో చక్రధరరావు అభినందించారు

## గొల్లలగుంట విద్యార్థిని లావణ్య శ్రీకి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సన్మానం



జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మే, 10:-జగ్గంపేట మండలం గొల్లలగుంట హై స్కూల్‌లో చదువుతున్న రాయుడు లావణ్య శ్రీ వీర వెంకట సౌమ్య 552 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానం సాధించింది.ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శనివారం ఇర్రిపాకలోని తన నివాసంలో లావణ్య శ్రీని ఘనంగా సన్మానించారు. లావణ్య శ్రీ గొల్లలగుంట గ్రామానికి చెందిన టిడిపి యువనేత రాయుడు వీరబాబు కుమార్తె. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు.పట్టుదల, కృషి ఉంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించగలరని తెలిపారు. లావణ్య శ్రీ అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని ప్రతి విద్యార్థి మంచి ఫలితాల కోసం ప్రయత్నించాలని సూచించారు.అనంతరం లావణ్య శ్రీకి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సంగారెడ్డి భరోసా సెంటర్ ఆధ్వర్యంలో చైల్డ్ సేఫ్టీ, బాలల రక్షణపై ప్రత్యేక అవగాహన

**సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ మే 02 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు ఈ రోజు తేది: మే 02. నాడు సంగారెడ్డి భరోసా సెంటర్ ఆధ్వర్యంలో సంయుక్త పాఠశాలల్లో ట్రైనింగ్ పొందుతున్న టీచర్లకు, సంగారెడ్డి పట్టణంలో గల రాజీవ్ పార్క్ వద్ద కూలీలకు బాలల సంక్షేమం యువత అభివృద్ధి కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మీ మాట్లాడుతూ లింగ సమానత్వం పాటిస్తూ ఆడ, మగ తేడా లేకుండా సమానంగా చూడాలని సూచించారు.బాల్య వివాహాల వల్ల కలిగే సమస్యలను వివరించారు. అలాగే పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ, ఇటువంటి కేసులను తీవ్రంగా పరిగణించి నిందితులకు కఠిన శిక్షలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.మౌనం వీడి నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తేనే బాధితులకు న్యాయం జరిగి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో ఉపయోగపడే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లతో పాటు జిల్లా భరోసా సెంటర్ నెంబర్ 8712656773 ను తమ ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు.

## ఆకతాయిల ఆగడాలకు చెక్

**సైలెన్సర్లు మార్పు చేసిన వాహనాల సైలెన్సర్లు సీజ్**

**సైలెన్సర్లు మార్పు చేసి ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవు**

**ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్‌లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ -- పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అశోక్**





సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ మే 02 స్టేట్ బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్): బైక్ సైలెన్సర్లు మాడిఫై చేసి పెద్ద శబ్దాలతో ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ, వృద్ధులు,గర్భిణీ స్త్రీలు మరియు సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ ఆదేశానుసారం ఈ పటాన్ చెర్వు పట్టణంలో పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అశోక్,ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తూ శబ్ద కాలుష్యం కలుగజేస్తున్న 07- వాహనదారులను గుర్తించి, మోటర్ వెహికిల్ చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అలాగే అట్టి వాహనాలకు అమర్చిన మాడిఫైడ్ సైలెన్సర్లను తొలగించడం జరిగింది. వాహనదారులు ఎవరైనా మాడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగిస్తూ పట్టణ ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా శబ్ద కాలుష్యం సృష్టిస్తే సహించబోమని, అట్టి వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అశోక్ తెలియజేశారు.

## తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బుద్ధ జయంతి

**గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచ శాంతికి స్ఫూర్తి**

**హైకోర్ట్ న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్**

హైదరాబాద్ వజ్రభారతి న్యూస్ మే 02 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్): తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించడం జరిగింది. బౌద్ధ ధర్మాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, శాంతి,అహింస,సత్యం అనే మానవ విలువలను బోధించిన గొప్ప స్ఫూర్తిదాయక మహోన్నతమైనటువంటి వ్యక్తి గౌతమ బుద్ధుడి స్ఫూర్తి నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోంది,ఆ మహనీయుడి ఆలోచనలను ఆచరణలో పెట్టి, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి, బుద్ధుని బోధనలు మన జీవితాల్లో స్ఫూర్తిని నింపి సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించాలనే సంకల్పంతో ఈ వేడుకలు నిర్వహించబడ్డాయి అన్నారు,ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి ,చిక్కుడు ప్రభాకర్, సీనియర్ కౌన్సిల్ హైకోర్ట్ అడ్వకేట్,జాయింట్ సెక్రటరీ కృష్ణ కీర్తన,హైకోర్ట్ అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్ యాదవ్, ఇతర బార్ కౌన్సిల్ సభ్యులు సీనియర్ అడ్వకేట్స్ పాల్గొని వేడుకలను మరింత ఘనంగా నిర్వహించారు.



# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం...

**రౌతులపూడి ఎంపీపీ గంటిమళ్ళ రాజ్యలక్ష్మి..కౌమార బాలికా గర్భధారణ ప్రమాదకరం...**

**జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారిణి జాగారపు విజయ**

**బాలికల సాధికారత దిశగా "కిశోరి వికాసం" నిర్వహణపై అవగాహన...**





**రౌతులపూడి... వజ్రభారతి ప్రతినిధి.ముఖే.వీరబాబు మే :- 2 :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం, కౌమార దశలో (టీన్ ఏజ్) గర్భధారణ జరిగితే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, అనారోగ్యానికి దారి తీస్తాయని, ప్రమాదకరం చోటు చేసుకుంటుందని రౌతులపూడి ఎంపీపీ. గంటిమళ్ల రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలోని రౌతులపూడి, శంఖవరం మండలాల ఐసిడిఎస్. సిడిపీఓ. పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో రౌతులపూడి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో "కిశోరి వికాసం"లో భాగంగా కిశోరి బాలికల కోసం అవగాహన సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారిణి జాగారపు విజయ ముఖ్య అతిథిగా హాజరై సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. బాల్య వివాహాలు వంటి విషయాలు ఏమైనా ఉంటే పిల్లలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలపాలని ఆమె పిలుపును ఇచ్చారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అందువల్ల బాల్య వివాహాలను చేసుకోవద్దని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని,వివిధ చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రస్తుత ఎంపీపీ. గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరావు మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యా ప్రోత్సాహం, బాలికా విద్య ప్రాముఖ్యత, కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాల అభివృద్ధి, వివిధ చట్టాలపై అవగాహన, బాల్య వివాహాల నిరోధం, బాలికల భద్రత, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, స్మార్ట్‌ఫోన్ వినియోగం, సైబర్ భద్రత తదితర అంశాలపై సీడీపీవో పర్వత వెంకట లక్ష్మి వివరించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం గ్రామ స్థాయిలో జరిగే సమావేశాల్లో ఏఎన్ఎం, మహిళా పోలీస్, వీవోఏలు ఒక్కో అంశంపై శిక్షణ అందిస్తారని ఆమె వెల్లడించారు. ఎంఈఓ సతీష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. బాలికల సంపూర్ణ ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత నివారణ, పునరుత్పత్తి ఆరోగ్యం వంటి అంశాలపై ములగపూడి పిహెచ్సీ ఎంపీహెచ్ఈఓ. మురళి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.డి.ఎ. కూటమి నాయకులు సింహాద్రి సూర్యనారాయణ, పసగడుగుల రమణ, మహిళా పోలీసులు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 6 నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

**జేఎన్టీయూ నీట్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్**





**సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ మే 02 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** ఆదివారం తేది: మే 03.2026న నిర్వహించబడనున్న నీట్-యూజీ 2026 పరీక్షల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 6 పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తెలిపారు. జిల్లాలో వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ తారా డిగ్రీ కాలేజ్, జేఎన్టీయూ-2 కేంద్రీయ విద్యాలయం (ఒర్డినెన్స్ ఫ్యాక్టరీ), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) సంగారెడ్డి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - పోతిరెడ్డి పల్లి కేంద్రాలలో పరీక్ష కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ అక్కడి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. మొత్తం 6 పరీక్ష కేంద్రాలలో 2,292 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్ష సమయం మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉంటుందని అన్నారు. అభ్యర్థులను ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రాలలోకి అనుమతిస్తారని స్పష్టం చేశారు.పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో 163 బి.యన్.యస్.యస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, గుంపులు గుంపులుగా తిరగడం నిషేధమని తెలిపారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ మినహా అభ్యర్థులు ఇన్విజిలేటర్లు ఎవరూ ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని హెచ్చరించారు.

**నీట్-యూజీ 2026 అభ్యర్థులకు సూచనలు:**

అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డ్‌తో పాటు చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు తీసుకురావాలి. పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు -- 2, పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో -- 1 తీసుకురావాలిపారదర్శక వాటర్ బాటిల్ మాత్రమే అనుమతించబడుతుంది. మెటల్/బంగారు/వెండి నగలు, గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా నిషేధం షూస్, సాక్స్ ధరించడం అనుమతి లేదు (సాధారణ చప్పులతో మాత్రమే అనుమతిస్తారు) పరీక్ష ప్రారంభ సమయానికి ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి ఆలస్యంగా వచ్చిన వారికి ప్రవేశం లేదు,అడ్మిట్ కార్డ్‌లో ఇచ్చిన అన్ని సూచనలు కచ్చితంగా పాటించాలి అభ్యర్థులు ఎటువంటి ఆందోళనలకు లోనవకుండా, నిబంధనలు పాటిస్తూ పరీక్షకు హాజరుకావాలని జిల్లా ఎస్పీ సూచించారు.ఈ సందర్భనలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సంగారెడ్డి డియస్పీ సత్యయ్య గౌడ్, ఎస్ఐ పాండు, విశ్వజన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్రర్ రావు, ప్రొఫెసర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

# పదిలమైన ప్రతిభకు కీర్తి కిరీటం!

**అ ధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కారం**

**మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సూచన**

విజయవాడ: విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేస్తున్నానని, ఈ విజయం స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి సత్కరించారు. అధికారులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలుచేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గరిష్ఠంగా 595 మార్కులు రాగా.. 31 మంది విద్యార్థులు 580, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 376 మంది విద్యార్థులకు 550కు పైగా మార్కులు వచ్చాయని అదేవిధంగా 1,557 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధించగలరని పేర్కొన్నారు. పదో తరగతి విజయాన్ని ఒక మొదటి మెట్టుగా భావించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. విద్యార్థుల విజయాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని.. వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వల్లే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలిగారని అభినందించారు. జిల్లా అభివృద్ధికి విద్యార్థులే చోదకశక్తులని పేర్కొంటూ, పోటీ ప్రపంచంలో ముందుండేందుకు లక్ష్యాలను చేరుకునే వరకు విశ్రమించకుండా పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో సాంబశివరావు, సమగ్రశిక్ష ఏపీసీ రమేష్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డ్ సెక్రటరీ ఉమర్ అలీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో విషాద ఘటన

## నవదంపతుల ఆత్మహత్య

హైదరాబాద్: హైదరాబాద్ కూకట్ పల్లిలో విషాదం చోటుచేసుకుంది. కార్తీక్(28), మంజుల(27) అనే నవదంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కార్తీక్ ఉరివేసుకోగా భార్య మంజుల పాయిజన్ తీసుకొన్నట్లు సమాచారం. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. మార్చి 8న పెళ్లి జరగగా రెండు నెలలైనా గడవకముందే ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నవదంపతుల మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కార్తీక్ మార్కెటింగ్ లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. మంజుల హౌస్ వైఫ్. మృతుడు సోదరుడు మాట్లాడుతూ.. ఇద్దరు సూసైడ్ చేసుకోవడం మమ్మల్ని కలిచి వేసింది.. మేము షాక్ లో ఉన్నామని తెలిపారు. కార్తీక్ మంజుల సూసైడ్ ఎందుకు చేసుకున్నారో తెలియదు. కార్తీక్ ఎంత ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయలేదన్నారు. తనకు అరగంట క్రితం పోలీసు నుండి మా సోదరుడు సూసైడ్ చేసుకున్నాడని కాల్స్ వచ్చినట్లు తెలిపాడు. దీంతో ఇంటికి చేరుకుని వెంటనే ప్రైవేట్ హాస్పిటల్ షిఫ్ట్ చేశాం.. బెడ్ రూంలో కార్తిక్ హ్యాంగ్ చేసుకున్నాడు.. మంజుల పాయిజన్ తీసుకుందని తెలిపాడు. కార్తీక్ మంజుల ఇద్దరు మంచిగా ఉండేవారన్నారు. నిన్న సాయంత్రం వారి ఇద్దరితో మాట్లాడాను వారు మంచిగా మాట్లాడారని చెప్పారు. ఎందుకు సుసైడ్ నిర్ణయం తీసుకున్నారో మాకు తెలియదన్నారు. కారణం ఏంటో అసలు తెలియదు.. పోలీసులు ఇన్వెస్టిగేషన్లో తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కూకట్‌పల్లి సీఐ శోభన్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటలకు సమాచారం అందింది.. ప్రైవేట్ హాస్పిటల్ వారు మాకు కాల్ చేసి ఇద్దరు సూసైడ్ చేసుకున్న కేస్ వచ్చిందని తెలిపారు. దీంతో మా టీమ్ తో ఆసుపత్రికి చేరుకున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు మృతి చెందారు.. కార్తీక్ బెడ్ రూమ్ లో హ్యాంగ్ చేసుకున్నాడు మంజుల పాయిజన్ తీసుకున్నట్లు ఉందని తెలిపారు. మంజుల తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాదస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు ఎందుకు సూసైడ్ చేసుకున్నారో కారణాలు తెలియరాలేదని అన్నారు

# బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే

### అక్కడ చెరవు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి

### ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ

హైదరాబాద్,మే2:హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలని రంగనాథ్ చెప్పుకొచ్చారు.

# పవన్‌కు సిఎం చంద్రబాబు పరామర్శ

హైదరాబాద్,మే2 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్యుల సలహాలను పాటించాలని కూడా చెప్పారు.తనను పలకరించడానికి వచ్చిన సిఎం చంద్రబాబుకు పవన్ కృతజ్ఞతు తెలిపారు.

# సింగపూర్‌లో విద్యావిధానం అమలు

అమరావతి,మే2 : ఏపీలోని ఉత్తమ ఉపాధ్యాయులను అంతర్జాతీయ స్థాయి విద్యా వ్యవస్థలను అధ్యయనం చేయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏపీ ఉపాధ్యాయుల బృందం.. సింగపూర్‌కు వెళ్లనుంది. ఈ నెల 4 నుంచి 9 వరకు సింగపూర్‌లో ఈ బృందం పర్యటించనుంది. సింగపూర్ పర్యటనకు ఏపీలో 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో బృందాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సింగపూర్‌లో అత్యాధునిక విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాలల్లో అమలవుతున్న వినూత్న ప్రయోగాలు, విద్యార్థుల అభివృద్ధి వ్యవస్థలను ఉపాధ్యాయులు సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. ఇప్పటికే ఈ బృందం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. అక్కడి నుంచి సింగపూర్‌కు విమానం ద్వారా ప్రయాణించనున్నారు. మిగిలిన ఉత్తమ ఉపాధ్యాయులను అధ్యయనం కోసం త్వరలో ఫిన్లాండ్‌కు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక విద్యలో ప్రపంచానికే ఫిన్లాండ్ ఆదర్శంగా నిలిచింది.

# నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు షురూ కలెక్టర్

### పిడి యాక్ట్ కింద కేసులు నమోదు కఠిన తరం చేయాలి

### నకిలీ విత్తనాల రహిత జిల్లాగా మెదక్ ను తీర్చిదిద్దాలి కలెక్టర్

### మెదక్ జిల్లాలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడటం

### విత్తన కంపెనీలు/డీలర్లకు కఠినమైన నిబంధనలు పెట్టడం. తథ్యం

### వానాకాలం కు సంబంధించి ఎరువులు పురుగు మందులు రైతులకు సరిపడా నిలువలు ఉండాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా వజ్రభారతి న్యూస్ మే02 జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (బి.మహేందర్): నకిలీ విత్తనాల రహిత మెదక్ జిల్లా గా తీర్చిదిద్దాలని,నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై టాస్కోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు షురూ చేసి.పిడి యాక్ట్ కింద కేసులు నమోదు కఠిన తరం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయ, రెవిన్యూ, పోలీస్. సీడ్ కార్పొరేషన్ల సమన్వయంతో వానాకాలం 2026 లో పర్యవేక్షణ అమలు కోసం విత్తనాలు ఎరువుల కన్వర్జెన్స్ సమావేశం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,ఆర్డీవోలు మెదక్ రమాదేవి,నర్సాపూర్ రామకృష్ణ, డీఎస్పీలు మెదక్ ప్రసన్న కుమార్, తూప్రాన్ నరేందర్ గౌడ్ ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుద్ర మూర్తి, సంబంధిత వ్యవసాయ,రెవిన్యూ, పోలీస్ అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల రహిత జిల్లాగా మెదక్ ను తీర్చిదిద్దాలని మెదక్ జిల్లాలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడటం, వచ్చే వానాకాలం పంటలకు ఎరువులు పురుగుమందులు రైతులకు బఫర్ స్టాక్ అందుబాటులో ఉండాలని అన్నారు.(స్పూరియస్) విత్తనాల విక్రయాలను పూర్తిగా అరికట్టడం కోసం జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించామని తెలిపారు ప్రభుత్వ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని, "నకిలీ విత్తనాల రహిత జిల్లా" సాధన దిశగా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ,సీడ్ కార్పొరేషన్లు (టీ ఎస్ ఎస్ డీ సీ/టీ ఎస్ ఎస్ ఓ సి ఏ), రవాణా శాఖల సమన్వయంతో టాస్క్ ఫోర్స్ బృందాలు . జిల్లాలో 01 జిల్లా స్థాయి బృందం, 03డివిజనల్ స్థాయి బృందాలు, 21 మండల స్థాయి బృందాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 334 రిటైల్ విత్తన దుకాణాలు,41 విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, 334 లైసెన్సు కలిగిన విత్తన హోల్డర్లు ఉన్నారని. ముఖ్యంగా పత్తి, వరి పంటలలో నకిలీ విత్తనాల సమస్య ఎక్కువగా ఉన్నందున, సీజన్ మొత్తం కఠిన తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు నకిలీ విత్తనాలు అనగా లైసెన్సు లేని సంస్థలు తయారు చేసినవని అనధికారికంగా విక్రయించబడినవి అని సరైన లేబులింగ్ లేని ప్యాకెట్లు, గడువు ముగిసినవి, ఉంటాయని టాస్కోర్స్ తనిఖీలలో సుదీర్ఘ పరిశీలన చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.2026 వానాకాలంలో సుమారు 03 లక్షల 26ఎకరాల్లో సాగు అంచనా వేయగా, దానికి సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు: రైతులకు ఎరువుల కొరత లేకుండా మార్క్ఫెడ్ ద్వారా తగిన నిల్వలను ముందే సిద్ధం చేస్తున్నామన్నారు.ముఖ్యంగా రైతులు విత్తనాలు కొనేముందు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, లూజ్ విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో కొనవద్దని రైతులకు సూచించారు.టాస్క్ ఫోర్స్ బృందాలు వారి విధులను సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం లక్ష్యంగా ముందుకు పోలన్నారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ, రెవిన్యూ పోలీస్ యంత్రాంగం టాస్కోర్స్ బృందాలుగా ఏర్పడి నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ముందుగా జిల్లా వ్యవసాయ విభాగం టెక్నికల్ సీడ్స్ అధికారిని వందన జిల్లాలో విత్తన చట్టాలు, వాటి అమలు, టాస్కోర్స్ బృందాలు ఏర్పాటు, ఈ అంశాలపై ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు సుదీర్ఘంగా వివరించగా,ఫర్టిలైజర్ వ్యవసాయ అధికారిని. హర్ష ఎరువులు పురుగు మందులపై బఫర్ స్టాక్, అనుమతి లేని కలుపు మందు విక్రయాలు జరగకూడదని నాణ్యమైన ఎరువులు పురుగు మందులు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ అకుల్ కుమార్ జైన్, తాసిల్దారులు,వ్యవసాయ శాఖ ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, డీఎస్పీలు, సి.ఐ.లు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కార్మిక దినోత్సవ సందర్భంగా న్యాయ అవగాహన సదస్సులు

### కార్మికులందరూ చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలి

### న్యాయమూర్తి బి.సౌజన్య జిల్లా కార్యదర్శి న్యాయ సేవ అధికార సంస్థ సంగారెడ్డి







**సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ మే 02 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుచనలతో జిల్లా న్యాయ సేవ్షధికార సంస్థ, కార్యదర్శి బి.సౌజన్య సంగారెడ్డి జిల్లా లోని జోగిపేట కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల లో, సంగారెడ్డిలోని హనుమాన్ నగర్ పరిధిలో గల ఇటుకబట్టిల కార్మికులకు న్యాయ అవగహనపై సదస్సులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన "జిల్లా న్యాయ సేవ్షధికార సంస్థ, కార్యదర్శి బి. సౌజన్య" మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు అన్ని చట్టలపైనా అవగాహనా కల్పించాలని సూచించారు. ముఖ్యంగా బాల్యవివాహ లను అరికట్టాలని అన్నారు. పాక్సో యాక్ట్ ద్వారా బాలలపై జరిగే లైంగిక నేరాలకు కఠినమైన శిక్షలు విధించబడుతున్నాయని వివరించారు. డొమెస్టిక్ వైలెన్స్ యాక్ట్ ద్వారా కుటుంబంలో మహిళలు ఎదుర్కొనే హింసకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని తెలిపారు. ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ వేధింపులు, ఆన్లైన్ మోసాలు వంటి సమస్యల నుండి బాలికలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి అన్యాయం జరిగినా ధైర్యంగా ఉంటూ భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని, బాగా చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, అందరు క్రమశిక్షణగా ఉండాలి అన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని తేలిపారు. సంగారెడ్డి లోని హనుమాన్ నగర్ పరిధిలోనీ ఇటుక బట్టీల కార్మికులకు అందుతున్న సౌకర్యాలు మరీ వారి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు అందరూ కచ్చితంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మరియు కార్మిక చట్టాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు, న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో జిల్లాలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మండల కేంద్రాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయలను సంప్రదించగలరు. న్యాయ సేవాధికార సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ 15100 నందు కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పాండు, జోగిపేట్ పోలీసు సబ్ ఇన్స్పెక్టర్, బాలికలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల ఆత్మగౌరవం దెబ్బతీస్తే ఊరుకోం

### ఆకివీడు రామాలయ ఘటనపై మందకృష్ణ మాదిగ

ఆకివీడు,మే2 :ఆకివీడు పెద్దపేట రామాలయం అంశంపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పందించారు. దళిత వర్గాలకు చెందిన వారిని ఎవరు ఇబ్బంది పెట్టినా, ఆత్మ గౌరవం దెబ్బ తీసేలా వ్యవహరించినా ఉరుకునేది లేదని తేల్చి చెప్పారు. తమపై దాడి చేసే వాళ్లు ఏ స్థాయి వారైనా సరే ఉమ్మడిగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఆకివీడు దళితవాడలోని గుడి విషయంలో కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నట్లు కృష్ణ మాదిగ తెలిపారు. అక్కడ గొంతేనమ్మ గుడి, గ్రామ సావిడి, రామాలయం ఉందా? అనే అంశంలో న్యాయస్థానం తుది నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ వివాదమంతా ఉండి ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చుట్టూ తిరుగుతోందన్నారు. ఈ కూటమి ప్రభుత్వ గెలుపులో తాము ప్రధాన భాగస్వాములుగా ఉన్నామని మందకృష్ణ గుర్తు చేశారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్.. సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం!



వనపర్తి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రెండవ దశ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ సురభి గారు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్ అహ్మద్ గారు ప్రకటనలో తెలియజేయడం జరిగింది. వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో మార్చి 26 నుంచి ఏప్రిల్ 2 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యచరణ ప్రణాళిక ద్వారా మన జిల్లాకు బ్యాంకులతో కూడిన యూనిట్స్ ఇవి. టూ వీలర్ కు 25 యూనిట్లు, జుఎ త్రి వీలర్ కు 11 యూనిట్లు, అగ్రిగోన్ సర్వీస్ 5 యూనిట్లు, అగ్రి మిషనరీ కామన్ హైరింగ్ సెంటర్ వన్ యూనిట్, సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ 9 యూనిట్లు, డైరీ 45 యూనిట్లు, సెరికల్చర్ లో మల్బరీ సాగుకు 4 యూనిట్లు, చౌకీ సెంటర్కు ఒక యూనిట్ కిసాన్ నర్సరీ రెండు యూనిట్లు హార్టికల్చర్ లో వెజ్ పెండాల్ లేదా ఆయిల్ ఫామ్ కు 7 యూనిట్లు మంజూరు కావడం జరిగింది. బ్యాంకు లోన్ లేకుండా 100% సబ్సిడీతో కూడిన యూనిట్స్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు 100% సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు కుల ధ్రువపత్రం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీ చేయబడినది అయి ఉండవలెను. ఆదాయం ధ్రువపత్రం మీసేవ ద్వారా జారీ చేసి ఉండవలెను. రవాణా రంగ పథకాల కోసం శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ టూవీలర్ టూ వీలర్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే అర్హులు. వ్యవసాయ పథకాల కొరకు పట్టాదారు పాస్ పుస్తకం రెండు ఎకరాల భూమి బోరు కలిగి ఉండాలి అలాగే వికలాంగులు అయితే సదరం సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలి.ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను జత చేసి సంబంధిత మండల కార్యాలయంలో సమర్పించగలరు. వ్యవసాయ పథకాల కొరకు 21 నుండి 60 ఏళ్లు వ్యవసాయతర పథకాలకు 21 50 ఏళ్ళు ఉండవలెను. శిక్షణ కొరకు 18 నుండి 45 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. అలాగే గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయం 1.5 లక్షలు పట్టణ ప్రాంతం వారికి 2.0 లక్షల ఆదాయం కలిగి ఉండాలి. రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి గారు తెలియజేయడం జరిగింది.

# ఆన్‌లైన్‌లో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారా? ఏ సర్వీస్ ఎప్పుడు ఉపయోగించాలో తెలుసా?



డిజిటల్ విప్లవం పుణ్యమా అని ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలు మన అరచేతిలోకి వచ్చేశాయి. గతంలో డబ్బు పంపాలంటే బ్యాంకుకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చేది, కానీ ఇప్పుడు క్షణాల్లో పని పూర్తవుతోంది. మరి ఏ సమయంలో ఏ సర్వీస్ యూజ్ చేయాలో తెలుసా? డిజిటల్ విప్లవం పుణ్యమా అని ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలు మన అరచేతిలోకి వచ్చేశాయి. గతంలో డబ్బు పంపాలంటే బ్యాంకుకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చేది, కానీ ఇప్పుడు క్షణాల్లో పని పూర్తవుతోంది. అయితే, ఈ సౌకర్యంతో పాటు వినియోగదారులకు ఒక కొత్త చిక్కు వచ్చి పడింది.  వంటి రకరకాల పద్ధతులు అందుబాటులో ఉండటంతో, ఏ సందర్భంలో ఏది వాడాలో తెలియక చాలామంది గందరగోళానికి గురవుతున్నారు. సరైన అవగాహన లేకుండా ఏదో ఒక పద్ధతిని ఎంచుకోవడం వల్ల లావాదేవీలు ఆలస్యం కావడం లేదా అనవసరమైన అదనపు ఛార్జీలు చెల్లించాల్సి రావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. అందుకే ప్రతి సిస్టమ్ యొక్క ప్రత్యేకతలు, పరిమితులు, అవి ఏయే పరిస్థితులకు సరిపోతాయో తెలుసుకోవడం ఇప్పుడు తప్పనిసరి.  ఇది ప్రధానంగా 'బ్యాచ్-ఆధారిత' లావాదేవీ విధానం. అంటే మీరు డబ్బు పంపిన వెంటనే అది అవతలి వ్యక్తి ఖాతాలోకి చేరదు. బ్యాంకులు ఈ లావాదేవీలను ఒక సమూహం రూపంలో నిర్ణీత సమయాల్లో ప్రాసెస్ చేస్తాయి. సాధారణంగా ఒక లావాదేవీ పూర్తి కావడానికి 30 నిమిషాల నుండి 2 గంటల వరకు సమయం పట్టవచ్చు. మీ ఆర్థిక లావాదేవీ అంత అత్యవసరం కానప్పుడు, అదనపు ఖర్చు లేకుండా సురక్షితంగా డబ్బు పంపాలనుకున్నప్పుడు చీజుఖీ ఒక అద్భుతమైన ఎంపిక. ముఖ్యంగా జీతాల చెల్లింపులు లేదా నెలవారీ బిల్లుల వంటి వాటికి ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. ఇక పెద్ద మొత్తంలో డబ్బును పంపాలనుకునే వారికి  అత్యంత నమ్మదగిన మార్గం. ఇది ప్రత్యేకంగా భారీ విలువ కలిగిన లావాదేవీల కోసం రూపొందించబడింది. ఇందులో 'రియల్ టైమ్' అంటే మీరు ఇక్కడ బటన్ నొక్కగానే అక్కడ అవతలి వ్యక్తి ఖాతాలో డబ్బు జమవుతుంది. దీనికి కనీస పరిమితి రూ.2 లక్షలుగా నిర్ణయించారు. అంటే రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తాన్ని వేగంగా, అత్యంత భద్రంగా పంపాలనుకున్నప్పుడు  కంటే మెరుగైన ఆప్షన్ మరొకటి లేదు. వ్యాపార లావాదేవీలకు మరియు ఆస్తి కొనుగోలు వంటి పెద్ద ఖర్చులకు ఇది సరిగ్గా సరిపోతుంది. మరోవైపు, సర్వకాలాల్లో అంటే 24/7 అందుబాటులో ఉండే సేవ కావాలంటే  ఎంచుకోవాలి. బ్యాంకు సెలవు దినాల్లో లేదా అర్ధరాత్రి పూట కూడా దీని ద్వారా క్షణాల్లో డబ్బు పంపవచ్చు. సాధారణంగా దీని పరిమితి రూ.5 లక్షల వరకు ఉంటుంది. అయితే, ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, చాలా బ్యాంకులు  లావాదేవీలపై కొంత రుసుము వసూలు చేస్తాయి. అందుకే చిన్న చిన్న మొత్తాలకు కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దీనిని వాడటం ఆర్థికంగా లాభదాయకం.

# ప్లాట్ కొంటే బెటరా? షేర్లు కొంటే బెటరా?





భారతీయులకి పెట్టుబడి అంటే ఇప్పటికీ భూమే మొదటి ఎంపిక.. కానీ 2026లో ఈ ఆలోచన ప్రమాదకరమైందిగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రియల్ ఎస్టేట్‌పై మమకారం వల్ల చాలా మంది పెట్టుబడిదారులు పెద్ద తప్పులు చేస్తున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. భారతదేశంలో పెట్టుబడి అనగానే సగటు మధ్యతరగతి కుటుంబానికి మొదట గుర్తొచ్చేది 'భూమి'. దశాబ్దాలుగా మన సమాజంలో ఆస్తి అంటే కేవలం ఒక ప్లాటో లేదా పొలమో మాత్రమే అనే భావన బలంగా నాటుకుపోయింది. భూమి అనేది కేవలం ఒక ఆర్థిక వనరు మాత్రమే కాదు అది భద్రతకు, సామాజిక హోదాకు చిహ్నంగా నిలుస్తుంది. అయితే, 2026 నాటి వేగవంతమైన ఆర్థిక మార్పుల నేపథ్యంలో, మన ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం ఉందని సెబీ (రాజుదీ×) రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అక్షయ్ బొమ్మెన అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై అక్షయ్ బొమ్మెన న్యూస్18 తెలుగుతో మాట్లాడుతూ.. "చాలామంది పెట్టుబడిదారులు భూమిపై ఉండే మమకారంతో నిర్ణయాలు తీసుకుంటారు. కానీ, ఇప్పుడు ప్రశ్న 'సౌకర్యం' గురించి కాదు, మీ పెట్టుబడి ఎంత వేగంగా పెరుగుతోంది (=వ్‌బతీఅం), అవసరమైనప్పుడు దాన్ని ఎంత త్వరగా నగదుగా మార్చుకోగలం (రాఅనబఱఅఓఎ), అది దీర్ఘకాలంలో సంపదను ఎలా సృష్టిస్తుంది అనే దానిపైనే ఉండాలి" అని సూచించారు. ఈ చర్చకు మూలంలో ఒక ప్రధాన వ్యత్యాసం ఉంది, అదే 'భావోద్వేగం వర్సెస్ ఆర్థిక సామర్థ్యం'. ఈక్విటీ లేదా స్టాక్ మార్కెట్ పెట్టుబడుల గురించి సామాన్యుల్లో ఉన్న అపోహలపై అక్షయ్ క్లారిటీ ఇచ్చారు. ఈక్విటీ పెట్టుబడిని సరైన పద్ధతిలో చేస్తే, అది అదృష్టంతో ఆడే జూదం కాదని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఇది పక్కా ప్రణాళిక, క్రమశిక్షణ, మార్కెట్ సమాచారం ఆధారంగా తీసుకునే నిర్ణయం. తమ పోర్ట్‌ఫోలియోలను తామే నిర్వహించుకోవాలనుకునే వారు, తమకు తగినంత ఆర్థిక జ్ఞానం, మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకునే స్వభావం ఉన్నాయని నిర్ధారించుకోవాలి. "మార్కెట్ గందరగోళాన్ని చూసి భయపడి లేదా అనవసరమైన ట్రెండ్‌లను అనుసరించే బదులు, నిరూపితమైన అనుభవం ఉన్న సలహాదారులపై ఆధారపడటం మంచింది" అని ఆయన సూచిస్తున్నారు.

# ఈ నెలలో అత్యంత భారీగా పడిపోయిన బంగారం ధర..



ఈ నెలలో బంగారం ధరలు దాదాపు 14 శాతం పడిపోవడం మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురి చేసింది. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే సంకేతాలు ఉన్నప్పటికీ, ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించడం కూడా ఈ పతనానికి కారణమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు, ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకుల విధానాలు కలిసి బంగారం ధరల్లో భారీ హెచ్చుతగ్గులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా ఈ నెలలో బంగారం ధరలు దాదాపు 14 శాతం పడిపోవడం మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఎకనామిక్ టైమ్స్ వెల్లడించిన కథనం ప్రకారం.. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే సంకేతాలు ఉన్నప్పటికీ, ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించడం కూడా ఈ పతనానికి కారణమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు, ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకుల విధానాలు కలిసి బంగారం ధరల్లో భారీ హెచ్చుతగ్గులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా ఈ నెలలో బంగారం ధరలు దాదాపు 14 శాతం పడిపోవడం మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఎకనామిక్ టైమ్స్ వెల్లడించిన కథనం ప్రకారం.. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే సంకేతాలు ఉన్నప్పటికీ, ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించడం కూడా ఈ పతనానికి కారణమైంది.  బంగారం ధర పడిపోవడానికి ప్రధాన కారణాలు  భారీ పతనానికి పలు అంతర్జాతీయ అంశాలు కారణమయ్యాయి. ముఖ్యంగా అమెరికా డాలర్ బలపడటం బంగారం ధరలపై నేరుగా ప్రభావం చూపింది. అలాగే, వడ్డీ రేట్ల తగ్గింపుపై ఉన్న అనిశ్చితి మార్కెట్‌ను మరింత ఒత్తిడికి గురి చేసింది. మరోవైపు, ముడి చమురు  ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం పెరిగింది. అయినప్పటికీ, సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లను తక్షణమే తగ్గించే పరిస్థితి కనిపించకపోవడం వల్ల బంగారం డిమాండ్ తగ్గింది. దీంతో 2008 తర్వాత ఒకే నెలలో ఇంత పెద్ద పతనం నమోదు అయింది. బంగారం ధర పడిపోవడానికి ప్రధాన కారణాలుఈ భారీ పతనానికి పలు అంతర్జాతీయ అంశాలు కారణమయ్యాయి. ముఖ్యంగా అమెరికా డాలర్  బలపడటం బంగారం ధరలపై నేరుగా ప్రభావం చూపింది. అలాగే, వడ్డీ రేట్ల తగ్గింపుపై ఉన్న అనిశ్చితి మార్కెట్‌ను మరింత ఒత్తిడికి గురి చేసింది. మరోవైపు, ముడి చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం పెరిగింది.

# డీజిల్ ఆటోమేటిక్ ఎస్‌యూవీలు 24 కి.మీ మైలేజ్. రూ.9.78 లక్షలకే లభ్యం

మీ బడ్జెట్ రూ.15 లక్షలు మాత్రమేనా? కానీ డీజల్ ఇంజిన్ టార్క్, ఆటోమేటిక్ సౌకర్యం, 24 కిలోమీటర్ల మైలేజ్ కావాలా? 2026లో హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రోడ్లపై ట్రాఫిక్, హైవేలు, కుటుంబ ప్రయాణాలకు ఇవి సూపర్ ఆప్షన్! దేశంలోనే అదిరిపోయే డీజల్ ఆటోమేటిక్ ాఖఎలు రూ.9.78 లక్షల నుంచి మార్కెట్‌లోకి వచ్చాయి. ఇవి సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు ఇంధన ఖర్చులను తగ్గించి, డ్రైవింగ్ ఆనందం పెంచుతాయి. కార్‌దేఖో మార్చి 2026 రిపోర్టు ప్రకారం ఇప్పుడు డీజల్ ఆటో ాఖఎలు ఇప్పుడు మరింత చవక అయ్యాయి. ఎందుకు ఇప్పటికీ డీజల్ ఆటో ాఖఎలు బెస్ట్? తెలంగాణలో డీజల్ ధర ?88-92 రూపాయలు ఉంటే, 24 కిలోమీటర్ల మైలేజ్‌తో నెలకు 1500 కిలోమీటర్లు ప్రయాణం చేసేవారికి పెట్రోల్ కంటే డీజిల్ ఆటోమేటిక్  ద్వారా నెలకు రూ.4000 నుంచి రూ.5000 ఆదా అవుతుంది. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ హైదరాబాద్ ట్రాఫిక్‌లో క్లచ్ బాధ లేకుండా సుఖంగా డ్రైవ్ చేయిస్తుంది. ఇది సురక్షితమైనది. ఫీచర్లు, స్పేస్ అన్నీ ఒకేసారి ఇచ్చే మోడల్స్ ఇవి. ఆధికారిక డేటా ప్రకారం ఇవి 5-స్టార్ సేఫ్టీ రేటింగ్‌లతో వస్తున్నాయని ఆటోకార్ ఇండియా, మార్చి 2026 రిపోర్టులో చెప్పింది.బంగారం ధరలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. డాలర్‌తో బంగారానికి ఉన్న సంబంధంబంగారం ధరల, అమెరికా డాలర్ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. డాలర్ బలహీనపడితే బంగారం ధరలు పెరగడానికి అవకాశం ఉంటుంది. ఎందుకంటే డాలర్ విలువ తగ్గినప్పుడు, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం తక్కువ ధరకే లభిస్తుంది. దీంతో డిమాండ్ పెరిగి ధరలు పైకి వెళ్లే అవకాశం ఉంటుంది. కానీ ప్రస్తుతం పరిస్థితి విరుద్ధంగా ఉండటంతో, బంగారం ధరలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.



Printed, Published, Edited & Owned by PAMMI YEDUKONDALU, Published From Door No. 2-2-14, 13th Ward, Komaravaram Road, TANUKU -534 211 West Godavari Dt., A.P.,
Printed at SRI SATYA OFFSET PRINTERS, Venkatrama Theater Street, TADEPALLIGUDEM - 534 102, West Godavari Dt., A.P. Editor : PAMMI YEDUKONDALU